

కెనాల్ రోడ్డుపైకి గోదావరి జలాలు

ప్రజాశక్తి - సామర్లకోట


కెనాల్ రోడ్ పైకి వచ్చిన గోదావరి జలాలు

గోదావరి జలాలు వికె.రాయిపురం - మాధవపట్నం గ్రామాల మధ్య గురువారం సాయంత్రం కెనాల్ రోడ్డుపై నుంచి ప్రవహించింది. రాత్రి సమయానికల్లా జలాల ప్రవాహం అధికమైతే పరిస్థితి ఏమిటని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి జలాలతో మండలానికి ఎటువంటి ముంపు బెడద ఉండదని తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందిని కాలువల వద్ద నియమించినట్లు తెలిపారు.

ఉన్న బస్సులకే ఉచితం

- సంఖ్య పెంచని ఆర్‌టిసి యాజమాన్యం
- మూడు రకాల సర్వీసులకే అవకాశం
- నేటి నుంచి 'స్త్రీ శక్తి' పథకం అమలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

'స్త్రీ శక్తి' పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈనెల 15 నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. విజయవాడలో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న సర్కారు ఉచిత సౌకర్యం కొన్ని బస్సులకే పరిమితం చేయడంపై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. బస్సుల సంఖ్యను పెంచకుండా పథకం అమలు చేయడం కష్టమే అని ఓ వైపు అధికారులు చెబుతుండగా ఇప్పుడున్న బస్సుల వరకే పథకం అమలు చేస్తామని సర్కారు అంటోంది.

కాకినాడ జిల్లాలో 304 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో వెన్నెల ఎసి బస్సులు 2, నైట్ రైడర్స్ 2, అమరావతి 4, ఇంద్ర ఎసి బస్సులు 17, స్టార్ లైనర్ 4, సూపర్ లగ్జరీలు 57, అల్ట్రా డీలక్స్ 24, ఎక్స్‌ప్రెస్‌లు 19, అల్ట్రా పల్లె వెలుగు 39, పల్లె వెలుగు బస్సులు 136 ఉన్నాయి. ఇవి రోజుకి 1,14,630 కిలోమీటర్లు నడుస్తున్నాయి.



సరాసరి రోజుకి సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకి దాదాపు రూ.52 లక్షలు వరకూ ఆర్‌టిసికి ఆదాయం సమకూరుతోంది.

అన్ని బస్సులకు లేని అవకాశం

ఐదు రకాల సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఈ జిల్లాలో మూడు సర్వీసులకు మాత్రమే మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. ఇక్కడ సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే ఉచిత ప్రయాణం సౌకర్యం ఉంది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కొన్ని ఇంటర్‌స్టేట్ సర్వీసులుగా రాష్ట్రం నుంచి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల్లోని వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయి. వీటిలో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఘాట్‌లో తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు. నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. అయితే జిల్లాలో కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, మళ్లీ అక్కడ నుంచి కాకినాడకు, కాకినాడ నుంచి అమలాపురం, అక్కడ నుంచి తిరిగి కాకినాడకు రోజుకి వందలాది మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు. నాన్ స్టాప్ బస్సుల్లో ఈ అవకాశం కల్పించకపోవడంతో పలువురు మహిళలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ రూట్లలో రోజుకి పదుల సంఖ్యలో నాన్ స్టాప్ సర్వీసులు తిరుగుతున్నాయి. కాకినాడ నుంచి అమలాపురం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తున్న మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో పథకం అమలుపై ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తుంది.

ప్రయాణికులు పెరిగే అవకాశం

'స్త్రీ శక్తి' పథకం అమలు అయితే బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రోజుకి సుమారు రూ.4 లక్షలు అదనంగా ఆర్‌టిసిపై భారం పడే అవకాశం ఉందని అంచనా. అయితే అందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేశామని చెబుతున్నారు. కానీ బస్సుల సంఖ్యను మాత్రం ప్రస్తుతానికి పెంచలేదు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నం కానున్నాయి. మహిళలు ఆధార్ కార్డు లేదా ఏదైనా ఇతర గుర్తింపు కార్డును చూపించి బస్సు ఎక్కితే కండక్టర్ జీరో టిక్కెట్ అందజేస్తారు. ఈ పథకం ద్వారా ఆక్యుపెన్సీ 100 నుంచి 120కి పెరిగే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 150కి కూడా చేరవచ్చు. ప్రస్తుతం బస్సుల్లో సిట్టింగ్ కెపాసిటీ 55గా ఉంది. ఫ్రీ బస్సు విధానం అమలు అయితే మరో 20 నుంచి 30 వరకూ అదనంగా బస్సులు ఎక్కే వారి సంఖ్య పెరుగుతుంది. దీంతో బస్సుల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తోపులాట, వివాదాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే కాకినాడ డిపో నుంచి తుని, రాజమహేంద్రవరం, అటు అమలాపురం, తాళ్లరేవు వంటి ప్రాంతాలకు వెళుతున్న బస్సుల్లో రద్దీ విపరీతంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే బస్సులో నిలుచునేందుకు ఖాళీ ఉండదు. ప్రస్తుతం ఉచిత బస్సు సర్వీస్ వలన ఈ రద్దీ మరింత పెరిగి విద్యార్థులు, ఇతరులు ప్రయాణించడానికి సమస్యలు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు ఆర్‌టిసి సిబ్బందిపై అదనపు భారం పడనుంది. ప్రధానంగా కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి పెరుగుతుంది. ఎక్కి దిగే ప్రయాణికులను నియంత్రించాలంటే తలకు మించిన భారంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులు బస్సు సర్వీసులను పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని బస్సుల్లోనూ అనుమతి



ఉచిత ప్రయాణ సౌకర్యం కొన్ని సర్వీసులకే పరిమితం చేయడం సరికాదు. జిల్లాలో ఉన్న అన్ని సర్వీసులకు ఈ సౌకర్యం కల్పించాలి. ముఖ్యంగా నాన్ స్టాప్ బస్సులకు అవకాశం ఇవ్వాలి. నిబంధనలను సడలించి, ప్రభుత్వం చిత్తశుద్ధతో ఆలోచించి మహిళల కోసం ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి.

-సిహెచ్.రమణి, ఐద్వా జిల్లా నాయకురాలు


స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్‌పి బిందుమాధవ్

స్వాతంత్ర్య దినోత్సవానికి సర్వం సంసిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఎస్‌పి బిందుమాధవ్, జెసి రాహుల్‌మీనాతో కలిసి పరిశీలించారు. పోలీస్ పెరేడ్ మైదానంలో ప్రధాన స్టేజి, అతిధులు, సాధారణ ప్రజలు కుర్చునే ప్రదేశం, స్టాల్స్ ఏర్పాటు, సకటాలు ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసామన్నారు. శుక్రవారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో ట్రైనీ కలెక్టర్ మానీషా, డిఆర్‌ఒ వెంకటరావు, జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహశీల్దార్ వి.జితేంద్ర, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫ్రెమ్రేషన్ ఇంజనీర్ సి.బాబురావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రూరల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ యూనియన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం సుందరయ్య భవన్‌లో ప్రాజెక్టు మహాసభ వీరవేణి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ పాల్గొన్నారు. కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా టి.రాజా, అధ్యక్ష, కార్యదర్శులుగా కె. వీరవేణి, వీరమణి, కోశాధికారి వరలక్ష్మి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా భవాని, రాజేశ్వరి, అచ్చురత్నం, తనూజ, సహాయ కార్యదర్శులుగా కనక మహాలక్ష్మి, లక్ష్మి, సత్యవేణి, జ్యోతి, కమిటీ సభ్యులుగా దివ్య, సత్య, అమ్మాజీ, సత్యవేణి, అప్పలకొండ, గనిలక్ష్మి, కల్పలత ఎన్నికయ్యారు.


ప్రాజెక్టు కమిటీ నూతన కార్యవర్గం

టైపిస్టులకు 18 నుంచి శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి బ్యాచ్ 60 మందికి ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల జడ్‌పి, మండల పరిషత్ కార్యాలయాల్లో నేరుగా నియామకం పొందిన వారికి ఈ ప్రాథమిక శిక్షణ ఇస్తామన్నారు. విధులు, బాధ్యతలు, కార్యాలయ నిర్వహణ, ఫైళ్ల నిర్వహణ, ఇ-ఆఫీస్, ప్రభుత్వ పథకాలపై నిపుణులతో ఈ శిక్షణ ఇస్తామన్నారు.

నేడు '78 ఏళ్ల స్వాతంత్ర్య భారతం'పై సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక కచేరిపేట యుటిఎఫ్ హోంలో '78 ఏళ్ళ స్వతంత్ర భారతం - స్వప్నాలు - సాకారాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్. గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొంటారని, ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అవసరమని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు అన్నారు. గురువారం ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బాలాజీ చెరువు సెంటర్ వరకు 250 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అటువంటి స్వాతంత్ర్య భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాజ్యాంగంలో హక్కులను వినియోగించుకుంటూ బాధ్యతలను కొనసాగించేలా పాలకులపై ఉద్యమించాలన్నారు. దేశంలో నేటికీ విద్య, ఉపాధి, వైద్యం ఉచితంగా అందని పరిస్థితి ఉందన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ప్రశ్నించే వారిపై నిర్బంధం చేయడం దారుణమని, అటువంటి చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నగర కార్యదర్శి సిహెచ్.సాహిత్య, నగర నాయకులు రాజేష్, కరుణ్‌కుమార్, పవన్, గమిని వేలు, నూకరాజు, భవాని, దేవి, కీర్తన పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలులో కుండపోత

-మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, ఏలేశ్వరం

గొల్లప్రోలు మండలంలో గురువారం కుండపోతగా వర్షం కురిసింది. పట్టణంలో కురిసిన వర్షంతో గొల్లప్రోలుకు ఎగువనున్న ప్రాంతాల్లో ఉన్న శుద్ధగడ్డ, ఏలేరు కాలవలు నిండి పొంగి పొర్లుతున్నాయి.


ఏలేరు జలాశయంలో భారీగా చేరిన వరద నీరు

పట్టణంలో పిడిందొడ్డు, కొత్త కాలువ, గొల్లప్రోలు హైవే, రైల్వే ట్రాక్, ఆనుకొని ఉన్న కొన్ని ప్రాంతాలలో వేలాది ఎకరాల వరి పంట పూర్తిగా నీట మునిగింది. వరి పంట వేసి నెలరోజులు కాకముందే మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిని అధికారులు మూసివేశారు. సుద్దగడ్డ కాలువ పొంగిపొర్లడంతో కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. సూరంపేటకు వెళ్లే మార్గం నీటిలో మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, తహశీల్దార్ గోపాలకృష్ణ గురువారం శుద్దగడ్డ కాలువ వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ తాటిపర్తి, చిన జగ్గంపేట గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో ఆర్‌ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. చేబ్రోలు, గొల్లప్రోలు, లక్ష్మీపురం గ్రామాల్లో నీట మునిగిన వరి, పత్తి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. 650 హెక్టార్లలో వరి, 60 హెక్టార్లలో పత్తి పంట నష్టం ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ పర్యటనలో పిఠాపురం వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


గొల్లప్రోలులో పొంగుతున్న శుద్దగడ్డ గడ్డ వాగు

ఏలేరుకు భారీగా వరద

ఏలేరు రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతుంది. రిజర్వాయర్ సామర్థ్యం 284 అడుగులకు గాను ప్రస్తుతం 256 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 4374 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో అధికారులు దిగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు దృష్టిలో ఉంచుకొని కేవలం 650 క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట, తాళ్లరేవు

అల్పపీడన ప్రభావంతో అధిక వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున మండల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఎంపిడిఒ కాదా హిమమహేశ్వరి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వర్షాల ప్రభావంపై ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న 4 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో విఆర్‌ఒలు ఎప్పటికప్పుడు వర్ష పరిస్థితులు, పంట కాలువలు, గోదావరి పిల్ల కాలు వల పరిస్థితిని గమనిస్తూ అధికారులకు సమాచా రం అందించాలన్నారు. మండల రెవెన్యూ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాళ్లరేవు తహశీల్దార్ పి.త్రినాధరావు ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు నష్ట నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.


'వరుపుల రాజా' పేరిట సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, రౌతులపూడి, ఏలేశ్వరం

డిసిసిబి మాజీ ఛైర్మన్, కీర్తిశేషులు వరుపుల రాజా 50వ జయంతి సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో టిడిపి శ్రేణులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి గ్రామంలో వరుపుల రాజా ఘాట్ వద్ద ఆయన సతీమణి, ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రత్తిపాడులో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాలలకు ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా భర్త వరుపుల రాజా నియోజకవర్గంలో చేసిన సేవలకు గుర్తింపుగానే ప్రజలు తనను ఎంఎల్‌ఏగా గెలిపించారని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వరుపుల రామకృష్ణ, వెన్నా శివ, బొదిరెడ్డి గోపి, ఎంపిపి గంటమల్ల రాజ్యలక్ష్మి, చక్కపల్లి నవీన్, పంది నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రౌతులపూడి మండలంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ వరుపుల రాజా జయంతిని ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యకర్తలు పలు గ్రామాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలు పాఠశాలకు ఫ్యాన్లను బహుకరించారు. అలాగే ఏలేశ్వరంలో వరుపుల రాజా జయంతి సందర్భంగా ఆయన కుమార్తె మాధురి స్థానిక ఎస్‌సి, ఎస్‌టి, బిసి వసతి గృహాలకు స్మార్ట్ టీవీలను బహుకరించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ తన తండ్రి నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కూటమి నాయకులు జ్యోతుల పెద్దబాబు, పెంటకోట మోహన్, పలివెల వెంకటేష్, వాగు రాజేష్, నూకతాటి ఈశ్వరరావు, పరవాడ రమేష్, మామిడి లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ

కార్టూ'నిజం'



వాళ్లకి మాత్రం నిత్యం ఏదోకపంట పండుతూనే ఉంటుంది కదరా!

మెడికవర్‌లో హెల్త్ చెకప్ ప్యాకేజీ

ప్రజాశక్తి - కాకినాడ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌లో ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీని ప్రకటించడం జరిగిందని మెడికవర్ యాజమాన్యం వెల్లడించింది. గురువారం హెల్త్ చెకప్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఒక ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీని అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్యాకేజీ ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని తక్కువ ఖర్చుతో సమగ్రంగా పరీక్షించుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. కేవలం రూ.1947 చెల్లించి ఈ ప్యాకేజీని పొందవచ్చన్నారు. సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీలో కంప్లీట్ బ్లడ్ పిక్చర్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, టోటల్ కొలెస్ట్రాల్, హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్, విఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్, టోటల్ సిహెచ్‌ఒఎల్, హెచ్‌డిఎల్ నిష్పత్తి, ట్రైగ్లిసరైడ్స్, లివర్ ఫంక్షన్ టెస్ట్, టోటల్ బిలిరుబిన్, ఎక్స్-రే చెస్ట్, ఇసిజి, 2డి ఎకో, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ హెచ్‌బిఎ1సి, యూరియా ఎలెక్ట్రొలైట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, సీరం క్రియాటినిన్ మొదలగు పరీక్షలు, కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, డైటీషియన్ కన్సల్టేషన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజీ ఆఫర్ ఆగష్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 040-68334455 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జేసన్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎడి విజయకుమార్

చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట

అసంఘటిత రంగంలో ఉన్న చిరు వ్యాపారులు ఉద్యమ ఆధార్ నమోదు చేసుకోవాలని చిన్న పరిశ్రమల శాఖ ఎడి విజయ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారికి ఉచితంగా ఆధార్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆధార్ నమోదు చేసుకుంటే పరిశ్రమ, వ్యాపారానికి ఒక సంఖ్య ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు రుణాలు పొందవచ్చన్నారు. ఈ సదస్సులో పరిశ్రమల పిఒ అరుణ్‌సందీప్, జగ్గంపేట, గండేపల్లి ఎపిఎంలు ఉమామహేష్, సన్యాసినాయుడు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుమ్యాన్ నూకరాజు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గత 44 సంవత్సరాలుగా కొత్తపల్లి గ్రామంలో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహించిన జోకా నూకరాజు గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నూకరాజు దంపతులను గ్రామస్తులు, తోటి ఉద్యోగులు సత్కరించారు. పోస్టుమ్యాన్‌గా ఆయన అందించిన సేవలను గ్రామస్తులు కొనియాడారు.


పోస్టుమ్యాన్ దంపతులకు సత్కారం

16న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పొనుగుపాటి వీధిలోని రాధాకృష్ణ ఆలయం వద్ద ఈ నెల 16 ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు లంకా విజయలక్ష్మి, లంకా మురళి, పెదిరెడ్ల రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభద్ర ఐ కేర్, డా. అగర్వాల్ కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్‌తో రావాలని సూచించారు.

అల్లిపూడిలో పొలంబడి కార్యక్రమం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ వరి నాట్లు వేసేటప్పుడు నారు కొనలను తుంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ జగ్గ అప్పారావు, సురేష్, వెంకటేష్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా నాలుగేళ్ల బాలుడి తీవ్ర గాయాలయ్యాడు. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు మండలం శీలలంకకు చెందిన జల్లి బాలాజీ(34) తన నాలుగేళ్ల కుమారుడు లక్కీతో కలిసి అమలాపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో వ్యాను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతని కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు అప్పన్నపాలెంలో సారా తయారీ కేంద్రంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నారు. 60 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు కూలి మీద పడటంతో యువకుని మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన యువకుడు పాయకరావుపేట మండలం రాంభద్రపురం, శ్రీరాంపురం మధ్య ఊహించని ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుళ్ల గ్రామానికి చెందిన తొట్టా శ్రీనివాస్ అనకాపల్లి జిల్లా కేశవరం డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి బైక్‌పై ఫ్యాక్టరీకి బయలుదేరాడు. దారిలో ఓ భారీ వక్షం కూలి శ్రీనివాస్ బైక్‌పై పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్(31) అక్కడిక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పాయకరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాస్‌కు రెండేళ్ల క్రితమే వివాహమైంది. ప్రస్తుతం భార్యతో కలిసి తుని పట్టణంలోని బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ మతి వార్త తెలియగానే దుళ్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, ఆటో

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని అనాతవరం సెంటర్ లో బస్సు ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం నుంచి తిల్లకుప్ప వెళ్తున్న బస్సు, అమలాపురం వైపు ఆటో అనాతవరం వద్ద గురువారం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ ఎలిపే రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతనిని చికిత్స నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంతకాలు సేకరిస్తున్న సిపిఎం బృందం

పక్కా వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగర పరిధిలోని 42వ డివిజన్ స్వామినగర్ పరిసర ప్రాంతాల ప్రజల రాకపోకలకు తూరల వంతెన స్థానంలో పక్కా వంతెన నిర్మించాలని సిపిఎం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ స్వామి నగర్ పంచాయతీగా ఉన్న సమయంలో గోదావరి కాలువపై తూరల వంతెన నిర్మాణం జరిగిందన్నారు. ఆనాడు గ్రామ పెద్దలు, ముఖ్యంగా యువకులు శ్రమదానం చేసి వంతెన నిర్మాణంలో విశేషమైన కృషి చేసారన్నారు. 2015లో స్వామినగర్ కాకినాడ నగర పాలక సంస్థ లో విలీనమైందన్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో జనాభా పెరిగిందని, వాహనాలు పెరిగి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు. మరొక ప్రక్క వంతెన శిథిలావస్థలో ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పక్కా వంతెన నిర్మించాలని సిపిఎం కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యుడు మలక వెంకటరమణ, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, ఎం. హరనాధ్, టి.రాణి, వి.చంద్రరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణం, రిటర్నింగ్ వాల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ రామకృష్ణ, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బెలూన్లతో ఇండియా చిత్రపటం

ప్రజాశక్తి -మామిడికుదురు

ఈదరాడ హైస్కూల్ విద్యార్థులు డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ సహకారంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులు బెలూన్లతో ఇండియా చిత్రపటాన్ని రూపొందించారు జాతీయ పతాకంలోని మూడు రంగుల బెలూన్లను ఉపయోగించి తయారుచేసిన ఈ చిత్రంను పాఠశాలలో ప్రదర్శించారు. ఈ చిత్రం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.

నేటి నుంచి ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి - కాకినాడ

స్త్రీ శక్తి పథకంలో నేటి నుంచి మహిళలు ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణించవచ్చునని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ శక్తి పథకంలో మహిళల కోసం అమలు చేసే ఆర్‌టిసి ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని శుక్రవారం సిఎం చంద్రబాబు విజయవాడలో ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం జిల్లాలో 177 బస్సులు ఉన్నాయని, పథకం వినియోగించుకునే మహిళలు ప్రయాణ సమయంలో గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాలన్నారు. అయితే నాన్‌స్టాప్, ఇతర రాష్ట్రాలకు వెళ్లే, పర్యాటక, లగ్జరీ, సూపర్ లగ్జరీ, సప్తగిరి(తిరుమల), అల్ట్రా డీలక్స్, స్టార్ లైనర్, ఎసి బస్సుల్లో ఈ స్కీమ్ వర్తించదన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చునని తెలిపారు. త్వరలో కాకినాడ డిపోకు 50 ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయని, వీటిలో కూడా ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ ఖాదిర్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరులో ఉన్న శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎవై.శ్రీనివాస్, ఆర్‌డిఒ కె.శ్రీరమణి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల నిర్వహణ తీరుతెన్నులు, వసతి సౌకర్యాలు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ రూమ్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు, స్పీచ్ తెరిపి కిట్లు, నిర్మల బీమా పథకం కార్డులు, యోగాంధ్ర సర్టిఫికెట్లు అందజేశారు. ఈ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీరమణి

కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల ఎడి కార్యాలయ పరిపాలనాధికారి యు.రాజు, సిహెచ్.శివరామకృష్ణ, పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపల్ ఆర్.సత్య, ఎఒ వేణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మెప్పిస్తేనే భవిష్యత్: ఎంఎల్ఎ నెహ్రూ



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

నీ తండ్రిని అనుసరించి ప్రజలను మెప్పిస్తేనే భవిష్యత్తు ఉంటుందని మాజీ సిఎం జగన్‌కు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ హితవు పలికారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పులివెందుల, ఒంటిమెట్ట ఉప ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయని జగన్ అనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లు వేశామని ప్రజలే చెబుతుంటే అప్రజాస్వామికమని ఎలా అంటారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి పాల్గొన్నారు.

వాలంటీర్ల ఎంపిక వేగవంతం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో గుర్తించిన 5,975 మంది పురుషులకు విద్య నేర్పేందుకు అవసరమైన వాలంటీర్లను త్వరితగతిన ఎంపిక చేయాలని ఎపిఒ సుధీర్ ఆదేశించారు. గురువారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్షరాస్యత కార్యక్రమంపై ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. మండల పరిధిలో నిరక్షరాశ్యులైన మహిళలను డిఆర్‌డిఎ ద్వారా, పురుషులను డ్వామా ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారన్నారు. మండల పరిధిలో 5975 మంది నిరక్షరాస్యులు అయిన పురుషులను గుర్తించారన్నారు. వీరిలో ఏడాదికి 1000 మంది నిరక్షరాశ్యులను అక్షరాస్యులుగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఒ సుధీర్

తీర్చిదిద్దుతారన్నారు. ఇందు నిమిత్తం ప్రతి గ్రామంలో పదిమంది నిరక్షరాశ్యులకు ఒక వాలంటీర్ను ఎంపిక చేయాలన్నారు.

'దేశభక్తిని పెంపొందించుకోవాలి'



దేశభక్తుల వేషధారణలతో విద్యార్థినులు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతీ విద్యార్థి దేశభక్తిని పెంచుకోవడం అవసరమని ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఝాన్సీలక్ష్మీబాయి, రాణిరుద్రమదేవి, కిట్టూర్ చెన్నమ్మ, చంద్రశేఖర్ ఆజాద్ వంటి దేశభక్తుల వేషధారణలో ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరుడి గుండెల నిండా దేశభక్తి ఉండాలని, ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత భావాలను కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజస్వరరావు, డి.అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

జాతీయ హాకీ జట్టుకు ఉప్పాడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్లో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ హాకీ చాంపియన్ షిప్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఉప్పాడకు చెందిన చొక్కా డేవిడ్, మెరుగు హెబెల్ ఎంపికయ్యారు. ఏప్రిల్ నెలలో ధర్మవరంలో జరిగిన ఎపి జూనియర్ హాకీ చాంపియన్ షిప్‌లో వీరు ప్రతిభ కనబరిచారు. గతంలో స్కూల్ గేమ్స్ అండర్ 19 జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొంటున్న వీరికి రావు చిన్నారావు, సురక్ష డాక్టర్ శ్రీనివాసరావు, గంటా విజయకుమార్ స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ చేశారు. సర్పంచ్‌లు





నాగేశ్వరావు, జాన్, మణికంఠ గ్రామ పెద్దలు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, పిడిలు సురేష్ రాజు, పవన్ కుమార్, పద్మశ్రీ, కోచ్ రవిరాజు అభినందనలు తెలిపారు.



పైడ్రాజును అభినందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

సొసైటీ అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన బలరామపురం మాజీ సర్పంచ్ పైలా పైడ్రాజును గురువారం బలరామపురం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటును అందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు శ్రీసోమరౌతు రవి, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

25న టెండర్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 25వ తేదీన మరిడమ్మ ఆలయంలో కొబ్బరి చెక్కలు పోగుచేసుకోవడం, కోళ్లు, మేకలు, ఎనుపోతులు అమ్ముకునే హక్కు, భక్తులు సమర్పించినవి తీసుకునే హక్కుకు సంబంధించి టెండర్ కం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఆలయం పనిచేసిన వేళలో టెండర్ షెడ్యూలు పొందవచ్చున్నారు. సీలు టెండర్ వేసేవారు కార్యాలయం పనిచేసే వేళలో రూ.1000 చెల్లించి టెండర్ షెడ్యూలు పొంది ధరావత్ డిడి ద్వారా టెండర్ షెడ్యూల్తో జతపరిచాలన్నారు. 25వ తేదీ ఉదయం 10 గంటలలోగా టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు.

డివిజన్‌లో 708.8 మిల్లీమీటర్ల వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గురువారం 708.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ కె.శ్రీరమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటనందూరులో 43.8, తునిలో 57.2, రౌతులపూడిలో 95.6, శంఖవరంలో 123, ఏలేశ్వరంలో 56.8, జగ్గంపేటలో 44.6, కిర్లంపూడిలో 68.2, ప్రత్తిపాడులో 69.4, తొండంగిలో 90.4, పెద్దాపురంలో 24.6, గండేపల్లిలో 35.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందన్నారు.

గర్భిణులకు ప్రత్యేక ఓపీ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సర్వజన సామాన్య ఆసుపత్రిలో గర్భిణులు, స్త్రీల వ్యాధుల బాధితులకు ప్రత్యేక ఓపి రిజిస్ట్రేషన్ ఎస్ఆర్ఎంటి బ్లాక్ వద్ద ఏర్పాటు చేసినట్లు పరిపాలనా అధికారిణి డాక్టర్ ఎస్.లావణ్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు తల్లి బిడ్డ విగ్రహం ఎదురుగా ఉన్న గేట్లో నుంచి ఆసుపత్రికి వస్తే ఓపి టికెట్, డాక్టర్ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, మందులు అన్నీ ఎస్ఆర్ఎంటి బ్లాక్‌లోనే జరిగేటట్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విశ్వ భారతి విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామంలో విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు వందేమాతరం జయ నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాఠశాల కరస్పాండెంట్ నందిపాటి రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపి పర్యటనలో కానరాని కూటమి నాయకులు

ప్రజాశక్తి - యు కొత్తపల్లి

కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గురువారం ఉప్పాడ తీరంలో నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ పనులను మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబుతో కలిసి పరిశీలించారు. అయితే ఈ పర్యటనలో కూటమి పార్టీల నేతలు కన్పించకపోవడం చర్చానీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు కలిసి సమన్వయంతో అభివృద్ధి పనుల్లో పాల్గొనాలని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పదేపదే చెబుతున్నా నియోజకవర్గంలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. ఎంపి పర్యటనలో స్థానిక కూటమి నాయకులతో పాటు జనసేన సీనియర్ నాయకులు హాజరు కాలేదు. కలుపుకుపోవాలనే అధినేత పిలుపు ఆచరణలో కానరావడం లేదని కూటమి పార్టీల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంపి పర్యటనకు సంబంధించి ఆహ్వానం రాకపోవడం, అధికారులు సమాచారం



ఉప్పాడ తీరాన్ని పరిశీలిస్తున్న ఎంపి ఉదయ శ్రీనివాస్

అందించకపోవడంతో ఈ పర్యటనకు కూటమి నాయకులు దూరం అయ్యారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోటుపై మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లి ప్రమాదం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను రాయితీపై అందిస్తుందన్నారు. మత్స్యశాఖ అధికారులను సంప్రదించి వాటిని పూర్తి స్థాయిలో తెలుసు కోవాలని సూచించారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఉప్పాడ తీరప్రాంత శాశ్వత రక్షణ గోడ నిర్మాణానికి త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు కరుణాకర్, శ్రీరామకృష్ణ, మత్స్యకార నాయకులు గంటా విజయ్



ఫ్రెషర్స్‌డే వేడుకలను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ గంగాధర్

అఖిల్ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుక

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అఖిల్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుక ఘనంగా జరిగింది. గురువారం సరయు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత కరస్పాండెంట్ గంగాధర్ జ్యోతిప్రజ్వలన చేసి ఈ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య బేధాభిప్రాయాలు లేకుండా నడుచుకోవాలన్నారు. విద్యార్థుల జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఇంటర్మీడియట్ కీలకమని, ఈ దశలో విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కళాశాల యాజమాన్యాన్ని ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇనకోటి సునీత, అనంతపల్లి శ్రీనివాస్, కోడూరి వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకల్లో వివిధ వేషధారణలతో చిన్నారులు

'అగస్త్య'లో అలరించిన కృష్ణాష్టమి వేడుక

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని శాంతినగర్‌లో గల శ్రీ అగస్త్య వశిష్ట క్యాంపస్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో చిన్నతనం నుంచే వాటిపట్ల అవగాహన కల్పించే నిమిత్తం ఇటువంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. అలాగే అగస్త్య విద్యాసంస్థల సీనియర్ ఉద్యోగి అల్లుమల్లు ఏలియా, అకడమిక్ డైరెక్టర్ దొడ్డిపట్ల శ్రీపల్లవి, ప్రిన్సిపల్ వి.లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ స్వాతి, బయాలజీ టీచర్ ఎస్.పద్మజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

42 సారా రహిత గ్రామాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో నవోదయ 2.0లో 42 సారా ప్రభావిత గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించామని ఎక్సైజ్ సిఐ కెవివి.అర్జున్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లో 294 సారా కేసులను నమోదుచేసి 1454 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 99,540 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కేసులకు సంబంధించి 312 మంది ముద్దాయిలను బైండోవర్ చేసి 28 మంది నుంచి రూ.4.65 లక్షల జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఒక వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీలలో భాగంగా స్థానిక డాక్టర్ రత్నంరాజు నర్సింగ్ హోంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు పని చేస్తున్నాయా? లేదా? అనే అంశాలపై మూడు నెలల కొకసారి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. వైద్య సేవలు, ఫీజులు, ల్యాబ్ సదుపాయాలు, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి యాజమాన్యాలకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ విల్సన్



సభలో మాట్లాడుతున్న నాబార్డ్ డిడిఎం సోమనాయుడు

రాయితీపై కిసాన్ డ్రోన్ పంపిణీ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని శ్రీసత్య ఆగ్రో సిహెచ్‌సి గ్రూపు రైతులకు ఎపి గ్రామీణ బ్యాంక్ బూరుగుపూడి శాఖ రూ.9.80 లక్షల విలువ చేసే కిసాన్ డ్రోన్‌ను అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ బాలప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నా బార్డ్ డిడిఎం డాక్టర్ వై సోమనాయుడు మాట్లాడుతూ నూతన వ్యవసాయ యాంత్రీకరణతో రైతులు ముందుకు సాగాలని అన్నారు. పాడి పశువులకు సంబంధించి డైరీ రంగాల్లో రైతులకు కొత్త పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు రీజినల్ మేనేజర్ గంట శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ బ్యాంకు అన్ని రకాల వ్యవసాయ, గృహ, వాణిజ్య రుణాలను, సోలార్‌పై రాయితీపై రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ స్టాఫ్ ఎంకెఎస్.శంకర్, మాధురి దేవి, కిర్లంపూడి వ్యవసాయ అధికారిణి నాగసుధామాధురి, ఎఇఒ సురేష్ పాల్గొన్నారు.